
సాక్షి
మెదక్
ఆదివారం ౹ 12 ౹ మే ౹ 2024





క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో పౌర సరఫరాల డీఎం



దుర్గమ్మ సన్నిధిలో హరికృష్ణ

పాపన్నపేట(మెదక్‌): జిల్లా పౌరసరఫరాల విభాగం మేనేజర్‌ హరికృష్ణ తన కుటుంబ సభ్యులతో కలసి శనివారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. కుంకుమార్చనచేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌ రమేశ్‌, ధర్మకర్తలు రఘువీర్‌, మిల్లర్లు అశోక్‌ గుప్త ఉన్నారు.

గిరిజనులు బీఆర్‌ఎస్‌ వైపే

ఎస్టీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్‌



మాట్లాడుతున్న గిరిజన సంఘాల ప్రతినిధులు

నర్సాపూర్‌: మెదక్‌ పార్లమెంటు పరిధిలోని గిరిజనులందరూ బీఆర్‌ఎస్‌ వైపే ఉన్నారని బీఆర్‌ఎస్‌ ఎస్టీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ జేఏసీ చైర్మన్‌ డాక్టర్‌ కరాటె రాజునాయక్‌ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ మెదక్‌, సంగారెడ్డి, నర్సాపూర్‌ నియోజకవర్గాల్లోని గిరిజనులు బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్నారని, బీఆర్‌ఎస్‌ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ హయాంలోనే గిరిజన తండాలు అభివృద్ధిచెందాయన్నారు. జెడ్పీటీసీ బబియానాయక్‌, రఘురాంరాథోడ్‌, వెంకట్‌ భంజారా, రోహిత్‌ నాయక్‌, రమేశ్‌, మోహన్‌ నాయక్‌, రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యాన్ని నింపేందుకే ఫ్లాగ్‌మార్చ్‌: డీఎస్పీ

కొల్చారం(నర్సాపూర్‌): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ రాజేశ్‌ పిలుపునిచ్చారు. మండలంలోని రంగంపేట, పైతర చిన్నఘణాపూర్‌ గ్రామాల్లో శనివారం సెంట్రల్‌, తెలంగాణ స్టేట్‌ ట్రైనింగ్‌ ఫోర్స్‌ పోలీసులతో ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకే ఈ ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఓటింగ్‌ సమయంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెదక్‌ సీఐ కేశవులు, ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ జెండా ఎగరడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

తూప్రాన్‌: మెదక్‌లో కాంగ్రెస్‌ జెండా ఎగరడం ఖాయమని గజ్వేల్‌ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్‌ 5వ వార్డు కౌన్సిలర్‌ పల్లేర్ల జ్యోతిరవీందర్‌గుప్త ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ నాయకుడు వెంకటేశ్‌ యాదవ్‌తోపాటు అధిక సంఖ్యలో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్న నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్‌ పార్టీలో చేరుతున్నట్టు చెప్పారు. బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జ్యోతికృష్ణ, వైస్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌, రవీందర్‌గుప్త, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- సైలెన్స్‌ పీరియడ్‌లో పకడ్బందీ
- బల్క్‌ ఎస్‌ఎంఎస్‌లు, పోస్టులు నిషేధం
- అందరూ సహకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌

మెదక్‌ కలెక్టరేట్‌: భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకుని ప్రజాస్వామ్యం బలోపేతానికి సహకరించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో జిల్లా ఎస్పీ బాలస్వామి, సిద్దిపేట అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. పోలింగ్‌ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని చెప్పారు. మెదక్‌, నర్సాపూర్‌ నియోజకవర్గాల్లో మొత్తం 1,635 మంది, బయట జిల్లాలకు చెందిన 1,941 మంది, జిల్లాకు చెందిన 11,236 మంది సైతం పోస్టల్‌ బ్యాలెట్‌ద్వారా ఓటు వేసినట్లు తెలిపారు.

ప్రచారం నిషిద్ధం

ఎన్నికల ప్రచారం ముగియడంతో స్థానికేతరులు నియోజకవర్గాలను వదిలి వెళ్లాలని కలెక్టర్‌ ఆదేశించారు. సోషల్‌ మీడియా, టీవీలు, రేడియోలు, కేబుల్‌ నెట్‌వర్క్‌ల్లో ప్రచారం నిషిద్ధమని తెలిపారు. అనుమతి పొందిన ప్రకటనలకు మాత్రమే ప్రింట్‌ మీడియాలో అవకాశం ఉందని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టామని కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ తెలిపారు.

2124 పోలింగ్‌ కేంద్రాలు

మెదక్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ పరిధిలో 2124 పోలింగ్‌ కేంద్రాలు ఉండగా 18,28210మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్‌ చెప్పారు. అలాగే 1244లొకేషన్‌లు ఉన్నాయని, ప్రభుత్వం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డులను ఉపయోగించి ఓటు వేయవచ్చునని తెలిపారు.

241 మంది బైండోవర్‌: ఎస్పీ

జిల్లా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ పోలింగ్‌ ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 45 క్రిటికల్‌ పోలింగ్‌ స్టేషన్లలో లా అండ్‌ ఆర్డర్‌కు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆరుగురు డీఎస్పీలు, 19 మంది సీఐలతోపాటు అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 171 కేసులకుగాను 241మందిని బైండోవర్‌ చేసినట్లు తెలిపారు. 88లక్షల నగదు, 3,400 లీటర్ల మద్యం, 2000 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని సీజ్‌ చేశామని, వాటి విలువ సుమారు రూ.1.45 కోట్లు ఉంటుందని చెప్పారు. సమావేశంలో డీపీఆర్‌ఓ రామచంద్ర రాజు, ఎన్నికల పర్యవేక్షకుడు హరిదీప్‌ సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

మూడో ర్యాండమైజేషన్‌ పూర్తి

పోలింగ్‌ నేపథ్యంలో తుది ర్యాండమైజేషన్‌ ప్రక్రియ ద్వారా పోలింగ్‌ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లలను కేటాయించినట్లు కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ తెలిపారు. కలెక్టరేట్‌లో ఎన్నికల జనరల్‌ అబ్జర్వర్‌ సమీర్‌ మాధవ్‌ కుర్కోటి సమక్షంలో ర్యాండమైజేషన్‌ ప్రక్రియను పూర్తిచేసినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది జాబితాను ఆయా జిల్లాల కలెక్టర్లకు అందజేసినట్లు చెప్పారు.

సీ–విజిల్‌తో అక్రమాలకు అడ్డుకట్ట – జిల్లా ఎస్పీ బాలస్వామి

మెదక్‌ మున్సిపాలిటీ: సీవిజిల్‌ యాప్‌తో అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని జిల్లా ఎస్పీ బాలస్వామి సూచించారు. మెదక్‌ జిల్లా పోలీస్‌ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 13న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో 144 సెక్షన్‌ అమలులో ఉంటుందని, పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని హెచ్చరించారు. బాధ్యత గల పౌరులుగా అక్రమాలపై సీ–విజిల్‌ యాప్‌ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు.

పోలింగ్‌ కేంద్రాలలో బస చేయాలి

నర్సాపూర్‌: ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్‌ బూత్‌లలోనే బస చేయాలని కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ ఆదేశించారు. శనివారం ఆయన నర్సాపూర్‌లోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలింగ్‌ అధికారులు, సిబ్బంది ఆదివారం చెక్‌ లిస్టుకు అనుగుణంగా ఈవీఎంలు, పోలింగ్‌ మెటీరియల్‌ సరిచూసుకున్న అనంతరం వాటిని తీసుకుని వారికి కేటాయించిన కేంద్రాలకు వెళ్లాలని ఆదేశించారు. అనంతరం బీవీ రాజు ఇంజనీరింగ్‌ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూంలు, కౌంటింగ్‌ రూంలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట స్థానిక ఆర్డీఓ, అసిస్టెంటు ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు కమలాద్రి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

నాలుగు నెలల్లోనే విఫలం

- అబద్ధాలతో కాంగ్రెస్‌ అధికారంలోకి..
- కోడ్‌ ముగియగానే రూ.100 కోట్లతో ట్రస్టు
- బీఆర్‌ఎస్‌ మెదక్‌ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

మెదక్‌జోన్‌: ఈ పార్లమెంట్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు విశేషమైన స్పందన వచ్చిందని, తన గెలుపు ఖాయమైందని, కోడ్‌ ముగియగానే ఇచ్చిన మాట ప్రకారం రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తానని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అబద్ధాలతో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిందని, కేవలం నాలుగు నెలల్లో ఆ పార్టీ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. 10 ఏళ్ల కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి, కొత్త జిల్లాలకు కనీసం నవోదయ పాఠశాలలు ఇవ్వలేదన్నారు. విభజన చట్టం కింద తెలంగాణకు రావాల్సిన నిధులు, పనులు చేయలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ రెండు ప్రభుత్వాలు ప్రజలకు సేవ చేసే విషయంలో విఫలమయ్యాయని అన్నారు. బీఆర్‌ఎస్‌ మాత్రమే రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తుందన్నారు. సొంత నిర్ణయాలు తీసుకొని సీఎం రేవంత్‌ రెడ్డి ఈ రాష్ట్రానికి ఏం చేస్తాడని ప్రశ్నించారు. తాను కలెక్టర్‌గా, జాయింట్‌ కలెక్టర్‌ గా 11 ఏళ్లు ఇదే జిల్లాలో పనిచేసి ఎంపీగా పోటీ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్‌ బరిలో ఉన్న అభ్యర్థుల గుణగణాలు చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దుబ్బాకలో పరాజయం పొందిన రఘునందన్‌ రావును నమ్మొద్దన్నారు. ఫేక్‌ వీడియోలు చేసి నీచమైన కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో డీజీపీ ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో శేరి సుభాష్‌ రెడ్డి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ మల్లికార్జున్‌ గౌడ్‌, నాయకులు బట్టి జగపతి, సోములు, మామిళ్ల ఆంజనేయులు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్‌): గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా చేసి అభివృద్ధి పనులు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే చెందుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం శివ్వంపేట మండలంలోని పలు గిరిజనతండాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్‌ పార్లమెంట్‌ అభ్యర్థిగా కేసీఆర్‌ బలపరిచిన బీఆర్‌ఎస్‌ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రమణగౌడ్‌, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌ గుప్తా, జెడ్పీ కో ఆప్షన్‌ మెంబర్‌ మన్సూర్‌, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విజయం ఖాయం..

నర్సాపూర్‌: బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి విజయం ఖాయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆమె పలు వార్డులలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ ఆరు గ్యారంటీల అమలులో విఫలం చెందిందని, దీంతో ప్రజలు ఆ పార్టీపై విముఖతతో ఉన్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలుచేశారని గుర్తుచేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు ఆత్మహత్య



శ్రీశైలం(ఫైల్‌)

చిన్నశంకరంపేట(మెదక్‌): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్‌ కథనం ప్రకారం.. చెన్నాయిపల్లికి చెందిన చిన్నోళ్ల శ్రీశైలం(23) డబుల్‌బెడ్రూం పథకంలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్‌ మేరకు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. అయితే ప్రభుత్వ నిధులు రాకపోవడంతో సందిగ్ధంలో పడ్డాడు. శుక్రవారం రాత్రి తల్లితండ్రులతో ఈ విషయంపై చర్చించాడు. ఈ క్రమంలో రాత్రి ఇంటి నుంచి వెళ్లిన శ్రీశైలం ఇంటికి తిరిగిరాలేదు. ఉదయం చూసేసరికి గ్రామ సమీపంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్టు తల్లిదండ్రులు గమనించారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్‌ తెలిపారు.

అప్పుల బాధతో..



స్వామి(ఫైల్‌)

నిజాంపేట(మెదక్‌): అప్పుల బాధ భరించలేక ఓ గిరిజన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, అతడి భార్య శిరీష కథనం ప్రకారం.. నగరం తండాకు చెందిన ఖేతావత్‌ స్వామి (20) కొంత కాలంగా అప్పుల బాధతో సతమతమవుతున్నాడు. అతడు తన పెళ్లి కోసం, అలాగే అతడి తాత చికిత్సకు రూ.2లక్షల వరకు అప్పులు చేశాడు. తీర్చే దారిలేక మనస్థాపం చెంది శనివారం ఉదయం తన పొలంవద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్‌

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్‌ పేపర్‌ ప్లేట్స్‌ & LED మిషీన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు. 9310515624, 8800496710 [G-1468]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్‌ టైం మాన్యువల్‌ రైటింగ్‌ వర్క్‌ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్‌ 3500/- మీ పేరు, అడ్రస్‌ కాల్‌/ వాట్సప్‌ చేయగలరు. 9502615217. [M-1185070]

■ Wanted Pest Control Technicians (Male) Q: 10+2 Pashamylaram, Choutuppal, Hyderabad Good Salary Hetero Pest Solutions Ph: 7207889796, 9441737022 [H-799877]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కాంగ్రెస్‌ కదనోత్సాహం

పటాన్‌చెరులో సీఎం రేవంత్‌ రోడ్‌షో సక్సెస్‌



మాట్లాడుతున్న రేవంత్‌ రెడ్డి

పటాన్‌చెరు / పటాన్‌చెరు టౌన్‌: లోక్‌సభ ఎన్నికల ప్రచారం చివరి రోజు సీఎం రేవంత్‌రెడ్డి పటాన్‌చెరులో పర్యటించారు. మెదక్‌ లోక్‌సభ కాంగ్రెస్‌ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా శనివారం పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనం భారీగా తరలివచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి పటాన్‌చెరుకు విచ్చేసిన సీఎం రేవంత్‌కు జనం నీరాజనం పలికారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి రింగ్‌రోడ్‌ వద్ద ముఖ్యమంత్రికి మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, మెదక్‌ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీఎస్‌ఐఐసీ చైర్మన్‌ నిర్మలారెడ్డి, పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌, ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీగా పటాన్‌చెరు అంబేడ్కర్‌ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ రోడ్‌షోలో రేవంత్‌ రెడ్డి 23 నిమిషాలు మాట్లాడారు. సీఎం ప్రసంగంతో కాంగ్రెస్‌ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. ఎస్పీ రూపేష్‌ ఆధ్వర్యంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌ రెడ్డి, సీఐ ప్రవీణ్‌ రెడ్డి నేతృత్వంలో భారీ బందోబస్తు చేపట్టారు.


కాటాను ఎమ్మెల్యేగానే చూస్తాం.. : సీఎం రేవంత్‌

సీఎం రేవంత్‌ రెడ్డి తన ప్రసంగంలో కాటా శ్రీనివాస్‌ గౌడ్‌ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాటను గెలిపించి ఉంటే ఈ ప్రాంతంలో నిధుల వరద పారేదని చెప్పుకొచ్చారు. ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపిస్తే చట్టసభల్లో ఈ ప్రాంత సమస్యను వివరించే అవకాశం ఉంటుందని రేవంత్‌ చెప్పారు. ఎంపీగా మధును గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తానని రేవంత్‌ చెప్పారు. తన దృష్టిలో కాట శ్రీనివాస్‌ గౌడ్‌ కూడా ఎమ్మెల్యేనని రేవంత్‌ చమత్కరించారు.

సంగారెడ్డి కింగ్‌ జగ్గన్న...

జగ్గారెడ్డి సంగారెడ్డి కింగ్‌ అని సీఎం రేవంత్‌ సంబోధించారు. సీఎం ప్రసంగం కొనసాగుతుండగా జగ్గారెడ్డి వాహన టాప్‌పైకి ఎక్కారు. ఆ సందర్భంలో సంగారెడ్డి కింగ్‌ జగ్గారెడ్డి అంటూ సీఎం అనడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున హోరెత్తారు. సీఎం కార్యాలయం అంతా జగ్గారెడ్డి దే నడుస్తుందని, తాను ఆయన ఎక్కడ సంతకం పెట్టమంటే, అక్కడ పెడుతున్నానని రేవంత్‌ చెప్పుకొచ్చారు.

గివేం ఎలచ్చన్లే.. గింత సప్పగున్నవి!



నర్సయ్య.. బాలయ్య.. ఇద్దరు దోస్తులు.. నర్సయ్య బీర్‌ కంపెన్ల పన్జేస్తడు.. బాలయ్య శేన్‌పన్జేస్తడు.. నర్సయ్య డ్యూటి దిగి ఇంటికి పోయి బుక్కెడు తిని.. టైంపాస్‌ కోసం బాలయ్య దగ్గర పోతడు.. ఇద్దరు గలిసి శౌరస్తలో కూసోని ముచ్చట పెడుతుంటరు.. చాయిదాక్కుంట.. దేశంల నడుస్తున్నవన్నీ సంగతులన్నీ మాట్లాడుకుంటరు.. కొద్ది సేపు సెల్‌ఫోన్లల్ల రీల్స్‌ జూశి నవ్వుకొని.. ఎక్కడక్కడ పోతుంటరు.. ఇప్పుడు ఎలచ్చన్లు నడుస్తున్నయి.. గదా.. ఈ దోస్తుల ముచ్చట రాజకీయం మీద మళ్లింది..

– పాత బాల ప్రసాద్‌
బ్యూరోఇన్‌చార్జి, ఉమ్మడి మెదక్‌ జిల్లా

సండే స్పెషల్‌

నర్సయ్య: అరె బాలిగా.. పదిగేను రోజుల నుంచి.. ఊర్లకు లీడర్ల పచారం ఆటోలొస్తున్నయ్‌.. మైకులల్ల పాటల్‌వెట్టి ఒక్క తీర్గా పచారం జేస్తున్నరు కాదా..

బాలయ్య: అనున్రా.. మైకులల్ల రోజు ఒర్రుతున్నరు గానీ.. ఒక్కల్లుగూడ ఇంటికచ్చి.. ఓటేయ్యుమని జెప్తలేరు.. నాల్నేల్ల కింద అయిన ఎమ్మెల్యే ఎలచ్చన్లల్ల ఓట్ల కోసం పతొక్కల్లు ఇంటికచ్చి ఒట్లేయ్‌మని అడిగిండ్రు.. కానీ ఇప్పుడైతే ఒక్కలు గూడ రాలే.. గా ఎలచ్చన్లల్ల ఉన్న మజా ఇప్పుడు కనిపిస్త లేదురా..

నర్సయ్య: అవున్రా.. కంపెన్ల నాకిపుప్పుడు రాత్రి షిఫ్టు నడుస్తుంది.. అందుకనే రోజంత ఇంట్లనే ఉంటున్న.. మా ఇంటికే గాదు., మా వాడక్కుడా లీడర్లేవచ్చాలే.. పోయిన ఎమ్మెల్యే ఎలచ్చన్లల్ల ఊర్లున్న లీడర్లు కూడా బాగానే ఎల్లాడిండ్రు.

బాలయ్య: ఇంటింటికి తిరుగుడు ఎక్కడ సాధ్యమైతదిరా.. ఎమ్మెల్యే ఎలచ్చన్లంటే మూడు నాలుగు మండలాలే ఉంటయి.. ఇంటింటికి తిరగస్తది.. గానీ ఇవి ఎంపీ ఎలచ్చన్లు గదరా.. పోటి జేశేవాల్లు ఈ మూల నుంచి ఆ మూలకు పోవాలంటే యాడికేంచయితదిరా.. ఎంపీ అంటే రెండు, మూడు జిల్లల్లాకు ఒకరుంటరు..

నర్సయ్య: ఊర్లన్ను లీడర్లు గూడ ఎక్కువ తిరుగతలేర్రా.. ఎండలకు బయట తిరగాలంటే కూడా ఎనుకాముందు అవుతుండ్రు.. ఎమ్మెల్యే ఎలచ్చన్లల్ల ఊర్ల లీడర్లు మస్త్‌ ఎల్లాడిండ్రు గానీ ఇప్పుడు పెద్దగ సప్పుడు చేస్తలేరు..

బాలయ్య: ఎమ్మెల్యే ఎలచ్చన్లల్ల మన ఊర్ల బాగనే దావత్‌లైనయి.. శికెన్లు.. మేకలు కూడా కోశిండ్రు.. బాటిల్లు కూడా ఇచ్చిండ్రు..

నర్సయ్య: అయినా వాల్లిచ్చేదేందీరా.. మన దావత్‌ మనమే జేసుకుంటాం కాదా.. వాల్లిచ్చే దానికి మనం ఎప్పుడైనా ఆశపడ్డమా.. ఎలచ్చన్లప్పుడే వాళ్లు దావత్‌లిస్తరు.. మల్ల మన మొకం జూడరు.. ఎప్పుడు కూడా మనమే దావత్‌లు చేసుకుంటం.

ఇంతకు నువ్వు ఓటు ఓల్లకేస్తవు..

బాలయ్య: నీ కొడుకు తరుణ్‌ గానికి ఓటక్కొచ్చిందారా..

నర్సయ్య : మొన్ననే అచ్చింది.. పేర్రాపిచ్చిన.. ఓటర్‌కార్డు కూడా వచ్చింది. ఈ ఎలచ్చన్ల వాడు పస్టుసారి ఓటేస్తడు.

బాలయ్య: ఔరా నర్సయ్య.. ఇంతకు నువ్వు ఓటు ఓల్లకేస్తవు.. ఈ ఎన్నికలల్ల వోల్లు గెలుస్తరంటవ్‌..

నర్సయ్య: బీజేపోల్లు మోదీ అనవట్టే.. కాంగ్రెసోల్లేమో రేవంత్‌రెడ్డి.. రావుల్‌గాంధీ పేర్లు జెప్తండ్రు.. కారు పార్టోల్లు కేసీఆర్‌ అంటుండ్రు. మిగిలిన పార్టోల్లు.. ఇండిపెండెంట్లు గూడా జోరుగనే పచారం చేస్తున్నరు.. ఎన్నికలల్ల నిలవడ్డోలు మాత్రం మేం గెలుస్తమంటే.. మేం గెలుస్తుమని జెప్తున్నరు.. మమ్మల్ని గెలిపిస్తే ఇదిస్తం అంటున్నరు.. మేమేం గెలిస్తే అది జేస్తం అంటున్నరు.. ఆలోచన జేసి ఓటేస్తా..

ఎవరు గెలుస్తరో తెలుస్తలేదు..

బాలయ్య: అవును గనీ.. మొన్న సంగరెడ్డికి మీటింగ్‌కు పోయినవటా.. నేను ఆరోజు మాసడ్డకునికి బియ్యం పోస్తుండ్రంటే ప్యాటకు పోయిన..

నర్సయ్య: అవు.. మీటింగ్‌కు పాయిన.. మన బుచ్చిరెడ్డి తీస్కపోయిండు.. డీసీఎంల వోయినం.. ఐదువందలిచ్చిండ్రు.. మీటింగ్‌కు మంది గూడ బాగనే వచ్చిండ్రు.. కనీ ఎండ తీసుడు తీసింది.. మాడవలిగింది..మీటింగ్‌ పోయివచ్చినంక రెండ్రోలు మనిషినిగాలే.. నువ్వు ఆ మీటింగ్‌కు రాన్దేనయమైంది.. వచ్చింటే నువ్వుగూడ పరేషానైతుంటివి.

బాలయ్య: అన్ని పార్టీల మీటింగ్‌లకు మంది బాగానే అస్తున్నరు.. కనీ ఎవరు గెలుస్తరో తెలుస్తలేదు..

అవుగనీ రేపేరా.. ఎలచ్చన్లు.. మనం ఓటీయ్యాలే.. హైద్రబాదుల పనిజేసే మీ తమ్ముడు శీను ఓటేయడానికి వచ్చిండారా..

నర్సయ్య: ఓట్లున్నయని ఆడికి సెలవిచ్చిండ్రట.. వాని భార్య, పిల్లలను తీసుకుని నిన్న పొద్దుగూకినంక అచ్చిండు..

తప్పకుండా ఓటెయ్యాలే..

బాలయ్య: అవును.. అందరు చెప్పేవి వినాలే.. ఆలోచన జేశి ఓటేయ్యాలే. తప్పకుండా ఓటేయ్యాలే. ఆగమాగం కావద్దు.. ఓల్లు మనకు మంచి చేసిండు.. అన్నీ ఆలోచన జేశి ఓటేయ్యాలే.. ఒకవేళ పోటీలో ఉన్నోళ్లు ఎవ్వరు నచ్చకపోయినా.. నోటా కన్న గుద్దిరావాలే.. కనీ ఓటు మాత్రం తప్పకవేయాలి. నువ్వు కూడా మీ ఇంట్లోల్లందరితోటి ఓటేపియ్యి..

నర్సయ్య: బరాబర్‌ వేస్తా.. ఒటక్కున్నొల్లందరితోటి ఓటేపిస్తా.. ఇగ ఇంటికి పోదాంరా.. ఆకలైతోంది.. బుక్కెడంత తిని పండుకుందాం.. చాయ్‌ పైసల్‌ పోన్‌పే జేసి.. ఇద్దరు గూడ బండి స్టాట్‌ చేసుకుని ఇండ్లల్లకు పోయిండ్రు. మనం ఓటేయడానికి పోలింగ్‌ కేంద్రానికి పోదాం పదండ్రి..

ప్రలోభాలు షురూ..

మూగబోయిన మైకులు

- రెండు నెలలుగా హోరెత్తిన ప్రచారం
- మద్యం, నగదుతో ఓటర్లకు ఎర
- పోలింగ్‌కు మరో 24 గంటల గడువు

మెదక్‌జోన్‌: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో మార్చి 16న షెడ్యూల్‌ విడుదలకాగా అప్పటి నుంచి మూడు విడుతలుగా ఆయా పార్టీల నేతలు ప్రచారానికి తెరలేపారు. బీఫాంలు దక్కించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏప్రిల్‌ 18న నామినేషన్లువేసి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అభ్యర్థులకు మద్దతుగా ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంతులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన సీఎంలు సైతం ప్రచారాల్లో నిమగ్నమయ్యారు. ర్యాలీలు, కార్నర్‌ మీటింగ్‌లు, భహిరంగ సభలు, రోడ్‌షోలతో హోరెత్తించారు. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

ప్రలోభాలకు తెరలేపిన నేతలు

ప్రచారం ముగియడంతో ఆయా పార్టీల నేతలు ప్రలోభాలకు తెరలేపారు. పోలింగ్‌ బూత్‌ల వారీగా లెక్కలు కట్టి ఎక్కడైతే మైనస్‌ ఉందో అక్కడ నేరుగా ఓటర్లకు మద్యం, డబ్బును ఎరవేస్తున్నారు. ఒక ప్రధాన పార్టీ బూత్‌కు రూ.30వేలతో పాటు ఆరు కాటన్ల మద్యాన్ని పంపిణీ చేసినట్లు సమాచారం. మరో ప్రధాన పార్టీ బూత్‌కు రూ.10వేలతోపాటు మద్యం పంపిణీ చేసినట్లు సమాచారం.

కోట్లలో ఖర్చు

ఈ ఎన్నికల్లో అభ్యర్థులు కోట్లాది రూపాయలను నీళ్లలా ఖర్చుచేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు పార్లమెంట్‌ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోగల ఆయా పార్టీల ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఒక్కొక్కరికీ రూ.5కోట్ల చొప్పున ఇచ్చినట్లు సమాచారం. అందులో ఒక అభ్యర్థి రూ.4.50కోట్లు ఖర్చు పెట్టి తనకు ప్రజల్లో ఎలా ఉంది. ఎంత మెజార్టీతో గెలుస్తానంటూ సొంతంగా సర్వే చేయించుకున్నట్లు తెలిసింది.



బైక్‌పై మద్యం తరలిస్తున్న దృశ్యం

వలస ఓటర్లపై కన్ను

ఇక పోలింగ్‌కు మరో 24గంటలు మాత్రమే గడువు ఉండడంతో ఉద్యోగ, ఉపాధికోసం గ్రామాలు విడిచి పట్టణాలకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను నేతలు ప్రసన్నం చేసుకుంటున్నారు. వారికి ప్రత్యేకంగా రవాణా సౌకర్యం కలిపించి ఒక రోజు ముందే స్వగ్రామాలకు పిలిచి వారికి భోజనాలు, మద్యం, డబ్బులు పంపిణీచేసి ఓట్లు వేయించుకునేందుకు ప్రధాన పార్టీలు కసరత్తు మొదలెట్టాయి.

3 రోజుల్లో రూ.18.25 కోట్ల మద్యం విక్రయాలు

నాయకులకు టోకెన్ల పంపిణీ

పాపన్నపేట(మెదక్‌): వైన్‌ షాపులు మూసివేస్తారని తెలియడంతో శనివారమే జిల్లాలోని వైన్‌ షాపులన్నీ కిటకిటలాడాయి. రాజకీయ నాయకులు టోకెన్ల పద్ధతిన లిక్కర్‌ కాటన్‌లు పెద్ద ఎత్తున ఆటోలు, కార్లలో తరలించారని తెలుస్తోంది. అధికారుల నిఘా వైఫల్యంతో జిల్లాలో లిక్కర్‌ జాతర నిరాటంకంగా కొనసాగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు రోజుల్లో ఐఎంఎల్‌ డిపో నుంచి రూ.18.25కోట్ల మద్యం కొనుగోలు చేశారని సమాచారం. జిల్లాలో 49 వైన్‌ షాపులు, ఐదు బార్లు ఉన్నాయి. ఘణాపూర్‌ ఐఎంఎల్‌ డిపో నుంచి అన్ని షాపులకు మద్యం సరఫరా అవుతుంది. ఈ నెల 9నుంచి 11వరకు రూ.18.25కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అందులో 19,172 కార్టన్ల లిక్కర్‌, 12,408 బీర్‌ కార్టన్లు కలసి మొత్తం 42,370 మద్యం కార్టన్లు అమ్మకాలు జరిగాయి. శనివారం ఉదయం 11గంటల వరకే డిపో నుంచి లిక్కర్‌ కొనుగోలుకు అవకాశం ఉందని, ఆపై సైట్‌ క్లోజ్‌ అవుతుందని తెలియడంతో వైన్‌షాపు యజమానులు తెల్లవారుజామునే ఐఎంఎల్‌ డిపో వద్ద క్యూలు కట్టినట్టు తెలుస్తోంది.

సమాచారం ఇవ్వండి

ఎక్కడైనా మద్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం ఇస్తే తక్షణమే రైడ్‌ చేసి కేసులు నమోదు చేస్తాం. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. రెండు నెలల నుంచి సుమారు రూ.2 కోట్ల విలువచేసే మద్యం పట్టుకున్నాం. 60 వాహనాలు సీజ్‌ చేశాం. నిరంతరం నిఘా కొనసాగిస్తున్నాం.

– శ్రీనివాస్‌ రెడ్డి, ఇన్‌చార్జి, ఇఎస్‌, ఎక్సైజ్‌